# నిత్యం ప్రజల్లోనే..

- రూ.వేల కోట్లతో ఊరూరా కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ జాతర
- మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు విస్తృత పర్యటనలతో నూతనోత్తేజం
- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో నిత్యం ప్రజల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు
- గులాబీ పార్టీలోకి భారీగా వలసలు.. డైలమాలో బీజేపీ, కాంగ్రెస్..
- కదన కుతూహలంతో బీఆర్‌ఎస్ శ్రేణులు



వికారాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్ (ఫైల్)

వికారాబాద్, అక్టోబర్ 7, (నమస్తే తెలంగాణ): జిల్లాలో అధికార బీఆర్‌ఎస్ పార్టీ అభివృద్ధి కార్యక్రమాలతో దూసుకుపోతున్నది. వరుసగా జిల్లాలోని ఏదో ఒక నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ వస్తున్నారు. జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.వందల కోట్లను మంజూరు చేయడంతో కేవలం పది రోజుల్లోనే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సార్వత్రిక ఎన్నికల నగారా మోగేందుకు గడువు సమీపిస్తుండడంతో అప్పటిలోగా ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జోరుగా జరుగుతున్నాయి. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతోపాటు ఆయా నియోజకవర్గాల్లో ప్రగతి నివేదన సభలు పేరిట వరుసగా భారీ బహిరంగ సభలు నిర్వహించడంతోపాటు బీఆర్‌ఎస్ పార్టీ కేడర్‌లో నూతనోత్సాహం వచ్చింది.

**పది రోజులు.. రూ.800 కోట్లు**

జిల్లాలో అధికార పార్టీ బీఆర్‌ఎస్ అభివృద్ధి కార్యక్రమాలతో రికార్డు సృష్టించింది. కేవలం పది రోజుల్లోనే జిల్లాలోని కొడంగల్, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల్లో రూ.800 కోట్లకుపైగా నిధులకు సంబంధించిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో రూ.300 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. కొడంగల్ నియోజకవర్గం కోస్గిలో 50 పడకల ప్రభుత్వాసుపత్రిని ప్రారంభించడంతోపాటు ముదిరాజ్ భవన్, అంబేద్కర్ భవన్‌లకు శంకుస్థాపన చేశారు. అలాగే అధిక మొత్తంలో నియోజకవర్గమంతటా రోడ్ల అభివృద్ధి పనులతోపాటు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. కొడంగల్ నియోజకవర్గం కోస్గిలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టగా.. కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్ మండలాల్లో అభివృద్ధి పనులకు రాష్ట్ర గనులు, భూగర్భవనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి శ్రీకారం చుట్టారు. తాండూరు నియోజకవర్గంలో రూ.300 కోట్లకుపైగా నిధులకు సంబంధించిన అభివృద్ధి పనులకు మంత్రి హరీశ్ రావుతోపాటు జిల్లా మంత్రి పట్నం మహేందర్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ప్రధానంగా ప్రభుత్వ నర్సింగ్ కాలేజీకి శంకుస్థాపనతోపాటు బషీరాబాద్‌లో 30 పడకల ప్రభుత్వాసుపత్రి నిర్మాణానికి, వ్యవసాయ మార్కెట్ కమిటీ భవన నిర్మాణాలతోపాటు తాండూరు, పెద్దేముల్ మండలాల్లో చెక్‌డ్యాంల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఒకేరోజు రూ.220 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

**ఒకే రోజు రూ.173 కోట్ల అభివృద్ధి పనులు**

వికారాబాద్ నియోజకవర్గంలోని వికారాబాద్ మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఒకేరోజు రూ.173 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ప్రధానంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో రూ.96 కోట్ల ఆర్వోబీ నిర్మాణానికి శంకుస్థాపనతోపాటు గిరిజన భవన్, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం, వికారాబాద్ మున్సిపాలిటీలో రూ.60 కోట్లతో రోడ్ల అభివృద్ధితోపాటు పార్కుల అభివృద్ధి, సుందరీకరణ పనులకు మంత్రి కేటీఆర్ శ్రీకారం చుట్టారు.

**మంత్రులు కేటీఆర్ హరీశ్‌రావు పర్యటనలతో..**

ముఖ్యంగా జిల్లాలో జరిగిన అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను బీఆర్‌ఎస్ పార్టీ అగ్రనేతలైన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ట్రబుల్ షూటర్‌గా పేరొందిన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు శ్రీకారం చుట్టారు. బీఆర్‌ఎస్ పార్టీ అగ్రనేతలు కేటీఆర్, హరీశ్‌రావు జిల్లాలో పర్యటించడంతో ఆ పార్టీ కేడర్‌లో ఫుల్ జోష్ వచ్చింది. బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కొడంగల్, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రగతి నివేదన సభలకు భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, ఆయా వర్గాల ప్రజలు తరలిరావడంతో జనసంద్రంగా మారాయి. మరోవైపు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ప్రగతి నివేదన సభల్లో 9 ఏండ్లలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని రంగాల్లో చేసిన అభివృద్ధితోపాటు సబ్బండ వర్గాల సంక్షేమానికి ఇస్తున్న ప్రాధాన్యత, చేస్తున్న రూ.వేల కోట్ల నిధుల ఖర్చును ప్రజలకు తెలియజేస్తున్నారు. ప్రధానంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా ఏడాదిలోగా జిల్లాకు సాగునీరందించేలా పనులు వేగవంతమవుతున్నాయనే వాస్తవాలను ప్రజల ముందుంచుతున్నారు. దీంతో జిల్లాలో అటూ బీఆర్‌ఎస్ కేడర్‌లో నయా జోష్ రాగా ఇటు సబ్బండ వర్గాల ప్రజలు బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి జైకొడుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్, బీజేపీలను వీడి గులాబీ కండువా కప్పుకుంటున్నారు. జిల్లాలోని వికారాబాద్, కొడంగల్, పరిగి, తాండూరు నియోజకవర్గాల్లో వేల సంఖ్యలో ఇతర పార్టీల నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతుండడం గమనార్హం.



# అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి

- సబ్బండ వర్గాల అభ్యున్నతి దిశగా ప్రత్యేక పథకాలు
- బతుకమ్మ సారెతో మహిళలకు గౌరవం
- సమాచార పౌర సంబంధాలు, గనులు భూగర్భ వనరుల శాఖల మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి
- కొడంగల్‌లో షాదీఖాన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన



షాదీఖాన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి

కొడంగల్, అక్టోబరు 7 : తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దేశానికి ఆదర్శంగా నిలిచిందని సమాచార పౌర సంబంధాలు, గనులు, భూగర్భ వనరుల శాఖల మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి పట్టణంలో రూ.కోటి నిధులతో చేపట్టనున్న షాదీఖాన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు క్రీడ కిట్‌ల, బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల వారు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలను అమలు చేసి అండగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. పారిశ్రామిక, వ్యవసాయ, వైద్య, విద్యతో పాటు సంక్షేమం, అభివృద్ధిలో ఎంతో ప్రగతిని సాధించామన్నారు.

**అన్నపూర్ణగా తెలంగాణ**

వ్యవసాయరంగం అభివృద్ధిని సాధించడంతో నేడు దేశంలోనే తెలంగాణ అన్నపూర్ణ రాష్ట్రంగా ఆదరణ పొందుతున్నట్లు మంత్రి మహేందర్‌రెడ్డి తెలిపారు. రైతులు పంట పండించే నాటి నుంచి పెట్టుబడి సాయంతో, పండిన ప్రతి గింజ కొనుగోలు చేసే విధంగా మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతన్నలకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే కాకుండా భవిష్యత్ తరాల అభ్యున్నతికి పాటుపడుతున్నట్లు తెలిపారు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.109 కోట్ల నిధులతో జిల్లాలోని 371 పాఠశాలలను ఆధునీకరించి కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలను మెరుగు పరుస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లోని ఆరోగ్య లోపాలను సవరించే దిశగా పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించడంతో పాటు సీఎం అల్పాహార పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. దీంతో జిల్లాలోని 1,051 పాఠశాలల్లోని 92వేల మంది విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన పౌష్టికాహారం అందుతున్నట్లు తెలిపారు.

**ముస్లింల అభ్యున్నతి కోసం..**

ముస్లిం మైనారిటీల అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా మైనారిటీ బంధును అందించి ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు మంత్రి మహేందర్‌రెడ్డి తెలిపారు. మసీదుల్లో ఉండే ఇమాం, మౌజన్‌లకు వేతనాలను అందించి గౌరవిస్తున్నట్లు తెలిపారు. అలాగే మసీదులు, కబ్రస్థాన్‌లు, షాదీఖాన నిర్మాణ పనులకు ప్రత్యేకంగా నిధులను మంజూరు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గతంలోని నాయకులు, పార్టీలో ఓటర్లుగా మాత్రమే గుర్తించి వాడుకొన్నారని పేర్కొన్నారు. ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని అందించి ఆదరించలేదని స్పష్టం చేశారు.

**మహిళలకు బతుకమ్మ సారె**

అన్ని వర్గాల పేదలు సంతోషంగా వేడుకలను జరుపుకునేలా నూతన దుస్తులను అందిస్తున్నట్లు మంత్రి మహేందర్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం దసరాను పురస్కరించుకొని జరుపుకునే బతుకమ్మ వేడుకల కోసం అన్ని వర్గాల మహిళలకు బతుకమ్మ చీరలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే గ్రామీణ యువతకు క్రీడల్లో ప్రోత్సహించుకు ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. వీటితో పాటు క్రీడా సామగ్రిని ఉచితంగా సరఫరా చేయడం హర్షణీయమన్నారు. ఇంత పెద్ద స్థాయిలో ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, బీఆర్‌ఎస్ పార్టీకి అందరం అండగా నిలుద్దామని కోరారు. పని చేసే ప్రభుత్వానికి అధికారాన్ని కట్టబెట్టి రానున్న రోజుల్లో మరింత అభివృద్ధిని సాధించుకుందామని తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు సలీం, కౌన్సిలర్ మధుసూ దన్‌రావు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రమేశ్ బాబు, మున్సిపల్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో పాటు ముస్లిం మైనారిటీ నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఛత్రపతి శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి

**వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్**

మర్పల్లి, అక్టోబర్ 7: ప్రతి ఒక్కరూ ఛత్రపతి శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని జడ్పీటీసీ మధుకర్, సర్పంచ్ ఉమారాణి గోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ యాదయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఛత్రపతి శివాజీ చేసిన సేవలను కొనియాడారు. ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆయన అడుగు జాడల్లో నడువాలన్నారు. కార్యక్రమంలో పూజారి యోగిష్ ప్రభుజీ, నాయకులు అశోక్, గోపాల్‌రెడ్డి, శివాజీ యువజన సంఘం సభ్యులు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, అనిల్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.



ఛత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్యే ఆనంద్